క్లుప్తంగా

పట్టభద్రుల ఆశీర్వాదంతో కాంగ్రెస్ విజయం



మాట్లాడుతున్న నర్సింగరావు

మల్లాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఆశీర్వాదంతో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అంతడపుల పుష్పలతనర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, డైరెక్టర్ నూతిపెల్లి రాజం, మాజీ చైర్మన్ సుంకేట నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న వేణుగోపాల్‌యాదవ్

ఇబ్రహీంపట్నం: ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని పీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ కోఆర్డినేటర్ వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నంలో విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, నాయకులు జైలేశ్, రెబ్బటి రాజశేఖర్‌యాదవ్, రమేశ్, వాల్గొట్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు



మాట్లాడుతున్న భూంరెడ్డి

కోరుట్ల: యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మరో రెండు రోజుల్లో కోరుట్ల పీఏసీఎస్‌లో అందుబాటులో ఉంటుందని చైర్మన్ ఎలిశెట్టి భూంరెడ్డి అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్లు పాతర్ల సత్యం, గడెల విజయ్ పాల్గొన్నారు.



ప్రమాదకరంగా ప్రహరీ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని పురాణిపేటలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతోపాటు ప్రముఖులు సైతం ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చారు. కానీ ఆ పాఠశాలకు సంబంధించిన ప్రహరీ ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అందులోకి వెళ్లే సమయంలో బిక్కుబిక్కుమంటూ వెళ్లారు.



ఎన్నికల కోడ్ ఉల్లంఘన

మల్లాపూర్: ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీలకు సంబంధించిన ఎలాంటి బ్యానర్లు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లను బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించొద్దని నిబంధన ఉంది. కానీ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. శ్రీకనకసోమేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా సోమేశ్వర కొండ మార్గంలో బుధవారం రాత్రి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఫొటోలతో స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.



ఏఎస్సైపై ఓటర్ల ఆగ్రహం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌లో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న ఏఎస్సై ఓటర్లతో దురుసుగా మాట్లాడగా.. ఓటర్లు ఏఎస్సై తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న పట్టణ ఎస్సై మన్మధరావు కలగజేసుకొని ఓటర్లకు సర్దిజెప్పి శాంతింపజేశారు.



కోరుట్ల: పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ



వెల్గటూర్ పోలింగ్ స్టేషన్‌లో వరుసలో పట్టభద్రుల ఓటర్లు



మల్లాపూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద పట్టభద్రుల ఓటర్లు

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

రాయికల్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జిల్లాలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఓటర్లు భారీగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాయికల్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం మందకొడిగా సాగి మధ్యాహ్నం నుంచి పుంజుకుంది. ఎస్సై సుధీర్ రావు బందోబస్తు చేపట్టారు. పట్టభద్రులు 2,175 మందికి 1,577, ఉపాధ్యాయులు 66 మందికి 66 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎంపీవో సుష్మ తెలిపారు.

ఓటేసిన డీఎస్పీ కుటుంబ సభ్యులు

జగిత్యాలక్రైం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పరిశీలించిన ఎస్పీ

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ధర్మపురిలో..

ధర్మపురి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1,765 మంది పట్టభద్రులకు 1,232, టీచర్లు 135 మందికి 130 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కోరుట్లలో..

కోరుట్ల: కోరుట్లలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం వేళ కొంత మందకొడిగా సాగినా.. సాయంత్రం నాలుగు గంటల సమయం ముగిసేసరికి గ్రాడ్యుయేట్ ఓటర్లు 71 శాతం, టీచర్ గ్రాడ్యుయేట్లు 93 శాతం వినియోగించుకున్నారు. కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రాడ్యుయేట్ల కోసం నాలుగు పోలింగ్ బూత్‌లు, టీచర్ ఎమ్మెల్సీ కోసం ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఇట్యాల కిషన్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ సాయంతో పోలింగ్ చిట్టీలు రానివారు పోలింగ్ బూత్‌ల నంబర్లు, ఓటు సీరియల్ నంబర్లు తెలుసుకొని ఓటేశారు. పోలింగ్ బూత్‌లను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు. కోరుట్ల కాంగ్రెస్ సెగ్మెంట్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ తీరును పరిశీలించారు. 226 పోలింగ్ బూత్‌లో జువ్వాడి నర్సింగరావు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మల్లాపూర్ మండలంలో..

మల్లాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 75 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ నమోదైంది. మండలవ్యాప్తంగా 23 పంచాయతీల పరిధిలో 1,038 మంది పట్టభద్రులు, 19 మంది ఉపాధ్యాయులకు మల్లాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో రెండు పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. పట్టభద్రులు 778 మంది, ఉపాధ్యాయులు 19 మంది వినియోగించుకున్నారు. మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి, తహసీల్దార్ వీర్‌సింగ్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పర్యవేక్షించారు. ఎస్సైలు కోసన రాజు, రాజునాయక్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది, ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించారు.

వెల్గటూర్‌లో..

వెల్గటూర్: మండలంలో పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పట్టభద్రులు 68.86 శాతం, టీచర్లు 66.66 శాతం పోలింగ్ నమోదైంది. ఎండపల్లి మండలంలో పట్టభద్రులు 68.27 శాతం, టీచర్లు 100 శాతం పోలింగ్ నమోదయినట్లు తహసీల్దార్ శేఖర్ తెలిపారు.

మేడిపల్లిలో..

మేడిపల్లి: మేడిపల్లి, భీమారం మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మేడిపల్లిలో 752 ఓటర్లకు 604 పోలయ్యాయి. ఉపాధ్యాయులు 26 మందికి 25 పోలయ్యాయి. భీమారంలో 449 పట్టభద్రఓట్లకు 335 పోలయ్యాయి. 9 మంది టీచర్లకు 9 మంది ఓటేశారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పోలింగ్ సరళి పరిశీలించారు.



కోరుట్ల: సీనియర్ సిటిజన్‌ను వీల్ చైర్‌లో తీసుకెళ్తూ..

పెగడపల్లిలో..

పెగడపల్లి: మండలవ్యాప్తంగా పట్టభద్రుల ఓటర్లు 1,602 మందికి 1,142, ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ఓటర్లు 36 మందికి 27 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎన్నికల అధికారి రవీందర్ తెలిపారు. పోలింగ్ సరళిపై విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరా తీశారు.

మల్యాలలో 69 శాతం..

మల్యాల: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 69 శాతం పోలింగ్ నమోదైంది. 1,956 మంది పట్టభద్రులకు 1,357 మంది, 37 మంది టీచర్లకు 33 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. అడిషనల్ కలెక్టర్ లత కేంద్రాలను పరిశీలించారు.

గంటన్నర ఆలస్యంగా..



కోరుట్ల: ఓటేస్తున్న కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలింగ్ స్టేషన్‌లో పట్టభద్రులు బారులు తీరారు. సాయంత్రం నాలుగు గంటలు దాటినా సుమారు 100 మంది లైన్‌లో ఉండడంతో.. అధికారులు వారందరికీ అనుమతించారు. దీంతో గంటన్నర ఆలస్యంగా ముగిసింది. 611 మంది పట్టభద్రులకు 456 మంది ఓటేశారు. 21 మంది ఉపాధ్యాయులకు 20 మంది ఓటేశారని తహసీల్దార్, రూట్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, సీఐ నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఓటేసేందుకు మండల కేంద్రానికి చెందిన గోరై మాలతి రాగా.. అధికారులు గుర్తింపు కార్డు చూపించాలని కోరారు. ఆమె ఓటర్ కార్డును చూపించగా.. చెల్లదని, ఆధార్ కార్డు కావాలని తిరస్కరించారు.

కథలాపూర్‌లో..

కథలాపూర్: మండలంలో పట్టభద్రుల ఓటర్లు 863 మందికి 630 మంది, టీచర్స్ ఓటర్లు 23 మందికి 20 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తహసీల్దార్ వినోద్, ఎస్సై నవీన్‌కుమార్ పర్యవేక్షించారు. ఓటర్లు కాంగ్రెస్‌కే ప్రాధాన్యమిచ్చారని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

బుగ్గారంలో..

బుగ్గారం: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం గ్రాడ్యుయేట్ ఓటర్లు 481 మంది ఉండగా.. 348 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీచర్లు 13 మంది ఉండగా.. అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ స్టేషన్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై మాడ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



సారంగాపూర్‌లో వరుసలో ఓటర్లు

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో..

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. సారంగాపూర్‌లో పట్టభద్రుల ఓట్లు 521 ఉండగా.. 419(79.36 శాతం) మంది, టీచర్ల ఓట్లు 11 మందికి 11 మంది(100 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీర్‌పూర్ మండలంలో పట్టభద్రులు 590 ఓట్లకు గాను 437 మంది(73.45 శాతం) ఓటేశారు. 25 మంది టీచర్లకు 24 మంది(96 శాతం) ఓటేశారు.

సారంగాపూర్ పోలింగ్ బూత్ 203లో వెలుతురు సరిగా లేదని పట్టభద్రులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. కిటికీలు తెరిచారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ఓటింగ్ సరళిని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరిశీలించారు.



సారంగాపూర్‌లో ఓటింగ్ సరళి పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

దుబాయ్ నుంచి వచ్చా



రాయికల్: ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లా. ఓటు హక్కు ప్రాముఖ్యం తెలుసు కాబట్టి మున్సిపల్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రతిసారి దుబాయ్ నుంచి వచ్చి ఓటేసి దుబాయ్ వెళ్తా. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కు ప్రాధాన్యం తెలుసుకొని ఓటేయాలి.

– సురతాని మల్లారెడ్డి, రాయికల్



వేంపల్లిలో..



బుగ్గారంలో..

కన్నుల పండువగా రథోత్సవం

మల్లాపూర్: వేంపల్లిలోని శివాలయంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కన్నుల పండువగా రథోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి వీర్‌సింగ్ ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బుగ్గారంలో..

బుగ్గారం: మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సంతాన సాఫల్య శ్రీసాంబశివనాగేశ్వరుని రథోత్సవం గురువారం మధ్యాహ్నం సాంబుని గుట్ట సమీపంలో కన్నుల పండువగా నిర్వహించారు. రోటిగూడకు చెందిన శ్రీహరిమౌనస్వామీజీ శుభాశీస్సులతో, శ్రీసాంబశివ నాగేశ్వర శక్తిపీఠం ఆచార్యుల పర్యవేక్షణలో, ఆలయ చైర్మన్ మసర్తి రాజిరెడ్డి ఆధ్వర్యంలో రథోత్సవం సాగింది. ఉత్సవం ప్రారంభానికి ముందు మూర్తులను అందంగా అలంకరించి వేదికపై ఉంచి అర్చకులు సాత్పడి రంగయ్య, బుగ్గారపు రాజయ్యశర్మ, కంచర్ల శివాచారి, సాంబశివ శక్తిపీఠం ఆచార్యులు అగస్త్య మహారాజు, శివ స్వాముల మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు.

ధర్మపురి: శివరాత్రి సందర్భంగా శివపార్వతుల రథోత్సవం గురువారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ధర్మపురిలోని అక్కపెల్లి శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో చైర్మన్ సీపతి సత్యనారాయణ ఆధ్వర్యంలో రథంపై ఉత్సవమూర్తులను ఆసీనులు చేసి దేవాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం, బస్టాండు మీదుగా రథంపై ఊరేగించారు. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో స్వామివార్ల రథోత్సవాన్ని నిర్వహించారు.



పెగడపల్లిలో భక్తజన సందోహం

పెగడపల్లి: మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి, వెంగళాయిపేట శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను డప్పుచప్పుళ్లు, ఒగ్గు కళాకారులు, శివస్వాముల నృత్యాలు, శివ నామ స్మరణలతో ఊరేగించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. పూజారులు గుండి శ్రీనివాస్‌శర్మ, రాజేశ్వరశర్మ, వినయ్‌శర్మ, చల్ల మధూకర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

గ్రామాల్లో జాతర ఉత్సవాలు



అంబారిపేటలో పూజలు చేస్తున్న విప్ శ్రీనివాస్

కథలాపూర్: పోతారం గ్రామంలో లొంక రామేశ్వరస్వామి, అంబారిపేటలో ఓంకారేశ్వరస్వామి, భూషణరావుపేటలో శివాలయం, చింతకుంటలో తారకేశ్వరస్వామి దేవాలయాల్లో గురువారం జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు అన్నదానం చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాశ్‌రావు పూజలు చేశారు.

విప్‌కు ఘన స్వాగతం



నేరెళ్లలో అడ్లూరికి స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మపురి: నేరెళ్ల సాంబశివ దేవాలయంలో గురువారం నిర్వహించిన శివపార్వతుల రథోత్సవ వేడుకలకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేవస్థానం పక్షాన ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

శోభాయాత్ర

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామ శివారులోని కొండపై వెలసిన గుట్ట రాజేశ్వర స్వామి శోభాయాత్ర నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీకనకసోమేశ్వరస్వామి జాతర

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీకనకసోమేశ్వరస్వామి జాతర ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు బలయ్యపెల్లి ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, మల్లాపూర్ ఎస్సై రాజు నేతృత్వంలో బందోబస్తు చేపట్టారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సదుపాయాలు

జగిత్యాల: డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 10 రోజుల్లో సదుపాయాలు పూర్తి చేస్తామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. నూకపల్లిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను గురువారం పరిశీలించారు. వసతుల కోసం ప్రభుత్వం రూ.32 కోట్లు మంజూరు చేసిందని, వాటితో డ్రైనేజీలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సెప్టిక్ ట్యాంక్‌ల వంటి పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. రూ.10 కోట్లతో నీటి సౌకర్యం కల్పించామన్నారు. నూకపల్లి వద్ద రంజాన్ మాసంలో ప్రార్థనలు చేసుకునేందుకు స్థలం కేటాయించాలని ముస్లింలు కోరగా.. ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శ్రీనివాస్, లక్ష్మణ్, ముజాహిద్, నాగయ్య పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పొరండ్లలో కల్యాణోత్సవం

జగిత్యాలరూరల్: పొరండ్ల గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. దేవాలయ ఆవరణలో వేదపండితులు కల్యాణం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

చల్మెడ పూజలు

మేడిపల్లి: తొంబరావుపేట్, పొరుమల్ల గ్రామాల్లో శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, సత్తిరెడ్డి, ఉదిగిరి రమ్య–ఆదిరెడ్డి, అజిత్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, భూమారెడ్డి, మకిలి దాసు, రవీంద్రరావు తదితరులున్నారు.



లక్ష్మీనరసింహారావును సన్మానిస్తున్న సభ్యులు

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దంపతుల పూజలు

జగిత్యాలరూరల్: పొలాస గ్రామంలోని శ్రీపౌలస్తేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు ఆనందరావు, కమలాకర్‌రావు, ప్రవీణ్‌గౌడ్, సాయిలక్ష్మి, సులోచన పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న దావ వసంత దంపతులు

ముక్తీశ్వరస్వామి కల్యాణం



వెల్గటూర్: ముత్తునూర్ గ్రామంలోని ముక్తీశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా పూలతో అలంకరించిన వేదికపై శివపార్వతుల ఉత్సవవిగ్రహాలను ఉంచి వేదమంత్రాల మధ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పురవీధుల మీదుగా స్వామివారి రథోత్సవం నిర్వహించారు.

శివపార్వతుల కల్యాణం

రాయికల్: ధర్మాజీపేట గ్రామంలోని శివాలయంలో గురువారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వేముల నరసయ్య, మమత తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికలను తలపించిన ఎమ్మెల్సీ ఎన్నికలు



జగిత్యాల: గతంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి పెద్దగా హడావుడి ఉండేది కాదు. కానీ ప్రస్తుతం ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే సందడి నెలకొంది. ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులకు సంబంధించిన నాయకులు ఉదయం నుంచే టెంట్లు వేసుకొని వచ్చిన అభ్యర్థులకు ఓట్లు వేయాలని అభ్యర్థించడం కన్పించింది. ఉదయం 8 నుంచి సాయంత్రం ఓటింగ్ పూర్తయ్యేవరకు సందడి వాతావరణం నెలకొంది.

ఓటర్లను 'ప్రసన్నం' చేసుకోని నాయకులు

రాయికల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కో ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు బూత్ లెవల్ నాయకులకు అందించారు. అయితే వచ్చిన నజరానాను నాయకులు పంపిణీ చేయకుండా తమ జేబులు నింపుకొన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తమతమ పార్టీ నాయకులు ఒక్కో బూత్‌కు చెందిన ఓటర్లకు పంపిణీ చేయాలని పంపించిన డబ్బులను పంచకుండా.. అభ్యర్థులకు మాత్రం పంపిణీ చేసినట్లుగా రాసి పంపడం విశేషం.

దుబ్బ రాజన్నకు భక్తుల తాకిడి



సారంగాపూర్: దుబ్బ రాజన్నకు గురువారం భక్తుల రాక కొనసాగింది. భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నపూజ నిర్వహించారు. కొబ్బరికాయలు, బెల్లం అమ్మకాల్లో టెండరు పొందిన వ్యక్తి భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి భక్తులు సారంగాపూర్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్వామివారి రథోత్సవం జరగనుంది.